విజ్ఞానుడు

ఇంద్రగంటి నాగేశ్వరశర్మ గారు

అది కార్తీకమాసము. రాత్రులయందు చలి యుపద్రవముగ వైచుచుండెను. దానం జేసి, రాజమందిరపురవాసు లెవ్వరును కాకులుకూసి భళ్లున తెల్లవారువరకును వీథులలోనికి వచ్చుటలేదు. కాని యప్పురమందలి యాడువాండ్రు ముఖ్యముగా పూర్వసువాసినులు కొందరుమాత్రము తాము పాడెడిపాటలచే నావీథులయందలి నిశ్శబ్దము జీల్చుచు, జాము రాత్రి యుండనగానే బయలుదేరి గోదావరీ స్నాన మాచరించి, సూర్యోదయమునకు పూర్వమే యిండ్లకేతెంచుచుండిరి. రాజమందిరపురవాసులందరికిని మిగుల వెరపుగలిగించిన యాచలిదేవత వీరినిమాత్రము చేరవెరచుచుండెను.

ఒకనాటిరాత్రి తెల్లవారుగట్ల నాలుగు గంటలాయెను. అపుడు వైగ్రాముర్వోడున, జానకమ్మయను నొకయువతీలలామ తనకక్షంబున నొకయిత్తడిబిందె నిరికించుకొని, బయలుదేరెను. ఆపె గోదావరినిజేరి యపుడే స్నానముజేయ నుద్యమించుచున్న యొక ముసలవ్వతో నిట్లు సంభాషించెను.

జాన:—పాపము! వృద్ధులు. చలిలో స్నానమునకు వచ్చారూ!

ముస:—చలేమిటమ్మా? ఇట్టి సమయాన గోదావరిలో సూర్యోదయానికి ముందుగా స్నానంచేస్తే పాపాలన్నీ పోతాయి. ఈమాసమేకదా అమ్మా, చేసినా మానినా!

జాన:—అవును లెండి. ఇంటివద్ద నెవరైనావున్నారా? మీరే తంటాలుపడాలా? చలికాలం; పెద్దలయిపోయారు.

ముస:— అన్నట్టు చెప్పడం మరచిపోయాను. మాక్షుణ్ణవాడికీమధ్య వివాహం చేశాము విన్నారా?

జా:—సంతోషము. కట్నా లేమిచ్చారమ్మా? నగ లేమయినా పెట్టారాఅండి?

ము:—2000 రూ. కట్నం యిచ్చినారు. ఉభయఖర్చులు పెట్టారు. మేము నగలు మాత్రము ప్రస్తుతము పెట్టలేదునుమండీ.

జా:—ఏవూరమ్మా వియ్యాలవారిది?

ము:—కోనసీమ. చాలాడబ్బున్నవాళ్లే లెండి. పిల్ల పెద్దదే. రెండుమూడేండ్లలో కాపురానికివస్తుంది.

జా:—బాగానేవుందండీ. మావిజ్ఞానానికికూడా పెళ్లి చేయాలని వుందండీ. వీడూ బి.ఏ. చదువుతున్నాడు. సంబంధాలు వస్తూనే ఉన్నాయండి. వాళ్ళతండ్రి కేమీనచ్చటంలేదు. కట్నంకుదిరితే పిల్ల బాగుండదు, పిల్ల బాగుంటే కట్నంలేదు. మావాడేసంబంధము పనికిరాదంటాడు. ఏమీతోచటంలేదు. నాకు పెద్దకట్నంబుచ్చుకొని సరదాగా తర్లి వెళ్ళి పెళ్లి చేసుకునివద్దా మని యన్నది. ఏంజరుగుతుందో తెలియదు.

ము:—ఏముటో కుట్టినాగమ్మ: వాడి కేమి తెలుసును? ఏదోచేసేయండి.

అని యీవిధముగా నాయిరువురును ప్రసంగించుచుండ, బాలభానుడప్పుడే తన కిరణములనల్దెసల వ్యాపింపజేయుచు, నభోమండలమున బారెడుదూర మెగబ్రాకి గోదావరీతరంగమాలికల కొకింత వన్నెపెట్టుచుండెను. జానకమ్మ మునలమ్మ లిరువురును, మాటలసందడిని ఆలస్యమయినదను కొనుచు పూజాదివిధులను త్వరితముగా నెరవేర్చి, స్నానమాచరించి, నీళ్ల బిందెలతో గృహాభిముఖులయిరి.

౨

ఆపురంబుననే క్రొత్తగా తమకుమారుని విద్యాభ్యాసమునకై యొక పేదసంసారులు కాపురంబునకు వచ్చిరి. వారికొక కూతురు గలదు. ఆమెపేరు సుగుణమణి. కుమారునిపేరు రామారావు. సుగుణ తలిదండ్రులు పేదవారైనను మిగుల మర్యాదగలకుటుంబములోని వారలు. జానకమ్మకుమారునకు పిల్లనిచ్చెద మన్నవారలలో వీర లొకరు. ఈసంగతి విజ్ఞానున కేమియు దెలియదు.

కళాశాలలోని స్నేహముచేత యొక నాఁడుసాయంకాలము రామారావు ఇంటికి విజ్ఞానుడేతెంచెను. వారలిద్దరును వాకిటనున్న కుర్చీల నలంకరించి, పేపరును జదువుకొనుచుండిరి. కొంతసేపయినతరువాత వారలీ విషయము నావిషయమును ప్రసంగింప దొడంగిరి.

ఇంతలో సుగుణమణి తనవినీలకుంతలముల సిగవైచికొని, మాలతీకుసుమంబులచే నలంకరించుకొని మందగమనయై వచ్చియు రాని నునుసిగ్గు దొంతరలతో నటునిటు తన చూపుల బ్రసరింపజేయుచు వాకిటనుండు మాధవీలతం జేరి బ్రోదిచేయుచుండెను.

సుగుణమణి కప్పుడే యౌవన మంకురించుచుండెను. ఆమెశరీరము పసిమిచాయ గలిగియుండెను. కొంచెము వయసునకు మీరిన పొడవరి. ఆమె శిరోజములు, విశాలనేత్రములనుండి వెడలుకాంతులు, నామె[illegible]సీమ

కెంతయు వన్నె వెట్టుచుండెను. సుగుణమణి తనసోదరునికి దెలియనీకుండ, తన వీక్షణములు విజ్ఞానునిపై ప్రసరింపజేయుచు, నంతలోనే లజ్జాభయరజ్జువు వెనుకకులాగ తన శిరంబును వంచుకొనుచుండెను. విజ్ఞానరావును తన హితునితో మాట్లాడుచున్నాడన్నమాట యేకాని, కాలమంతయు సుగుణ సుందర విగ్రహావలోకనమందే గడపివైచెను. వీరిద్దరి చూపులు నేకమాయెను. ఇంతలోనే చీకటులు నల్దెసల గ్రమ్మదొడంగెను.

"భోజనమునకు వేళయైనది. అన్నయ్యాను రమ్మను" మని లోనుండి కేక వినబడియెను. విజ్ఞానుడాతని యొద్ద సెలవుగైకొని నిజగృహంబున కరిగెను.

3

విజ్ఞానరావారోజున తానుజూచినసుందరి రామారావుసోదరియని తెలిసికొనెను. అప్పటినుండియు నాతడు తరుచుగా రామారావు ఇంటికిబోవుచు నాసుగుణం గాంచుచుండెను. విజ్ఞానునకు సుగుణయందమితవాత్సల్యముదయించెను. సుగుణగూడ తన్ను ప్రేమించినట్లు గ్రహియించెను. ఆపె నెన్నడైన పలుకరింప వలయునని కుతూహలపడుచుండెను; గాని యేమి మాట్లాడవలయునో యాతనికిదోచలేదు.

ఆతడామెను వివాహమాడుటకు తన తలిదండ్రు లియ్యకొనరనియపుడపుడుభయపడుచుండెను. దీనికి కారణము సుగుణ తలిదండ్రులు భాగ్యవంతులు గారనియు, తమతో సరిగా తూగలేరనియునే. రామారావుగూడ సుగుణ నెటులయిన తనకిచ్చి వివాహము చేయ నుద్దేశించియున్నసంగతి గ్రహియించి, విజ్ఞానుడు లోన నెంతయు సంతసమొందుచుండెను.

౪

ఉదయ మెనిమిదిగంటలప్రొద్దెక్కెను. విజ్ఞానుడప్పుడే గోదావరియందు స్నానమాచరించి దుస్తులను ధరియించుకొని, తాను చదువుకొనుగదియందొకకుర్చీపై గూరుచుండెను. ఈతనితండ్రి దామోదరుడు. విజ్ఞానుడు కొంచెము పొడవరియై సన్నముగా నుండును. చామనచాయగలశరీరము గలిగి, ఈకాలపు విద్యార్థులవలెనే క్రాపింగుగలవాడు. ఆతని ముఖారవిందము నాతని విశాలనేత్రములను జూడ, నాతడు విజ్ఞానమునకు నెలవగుమూర్తి కలవాడని తోపక మానదు.

విజ్ఞానుడు తనవ్రాయుబల్లమీద నొకపుస్తకమును దెరచి చదువుటకు మొదలుపెట్టెను. పత్రములను దిరుగవేయుచుండెను కాని మనమన్యథా యాకర్షింపబడుటచే తానెంత చదువ ప్రయత్నించినను లాభములేకపోయెను. పాఠము నచ్చట బారవైచి యేమియుం దోచనివానివలె నటునిటు చూడసాగెను. చొక్కాజేబులోని యొకకాగితమును దీసెను. నాలుగుసారులైనను జదివెను. తనివి దీరలేదు. మరల చదువసాగెను. తన బాష్పకణజాలముచే నాపత్రము దడిపివైచుచుండెను. 'ఉః' — అని నిట్టూర్పు నిగిడ్చెను. ఎట్టకేలకు తనలో నేమియో గొణుగుకొనుచుండెను.

'ఆహా! లోక మెంత యజ్ఞానతిమిరమున మునిగిపోయెను! ఎక్కువ కట్నమిచ్చిన యాతనికూతునే చేబెండ్లాడవలయునా! ఇది యేశాస్త్రములో వ్రాయబడినదో కదా! పిల్ల యెంతకురూపియైనను తల్లిదండ్రులకు నచ్చిన జాలును. తల్లిదండ్రులకు కట్నమెవ రెక్కువిచ్చిన వారిపిల్ల నచ్చును. ఇది యెక్కడిగోలయో కాని, ఇట్టి వివాహములవలన వధూవరులయం దన్యోన్యప్రేమ జనించుట సున్న. * * * * ఎంతమంది తమకూతులవివాహములకతన మాసిపోయిరో గదా! * * * ఇంక, ధనములేక తమసంసారము లెంతయో కష్టములతో గడుపుకొనుచు, తమకుమారికారత్నముల సత్కులీనులకును భాగ్యసంపన్నులకు నీయదలంచువారి యాశలన్నియు నట్టేట గలియవలసినదే. వార లెంతయో విచారించి, యెట్టకేల కేకురూపికో, లేక తమవలెనే దరిద్రదేవత కెరయగు నేసంసారికో తప్పక యిచ్చెదరు. ఈవిషయమున గొంత సంస్కరణము జరుగుట మేలుగదా!............'

అంతలో సుగుణయే తన్ను వివాహమాడనున్నదని యనుకొని సంతసింపసాగెను. మరల నేమియో గొణుగసాగెను. "మాతండ్రి నెట్లైన నొప్పింపవచ్చునుగాని, మాతల్లి మూర్ఖపుపట్టుగలది. ఆమెను దోచదు. ఎవ్వరుచెప్పినను వినదు. కట్నము గావలయు ననెడి యాశయేకాని కుమా * * *"— అని యేదియో యనుకొనుచుండ "విజ్ఞానరావూ" అని వీథిలోనుండి కేక వినబడియెను. వెంటనే స్నేహితుడు రామారావు గదిలో ప్రవేశించెను. వీరలిద్దరు కలిసి కళాశాలకుం బోయిరి.

౫

ఆదివారముకచేరీకి సెలవుదిన మగుటచే దామోదరుడుగా రింటియొద్దనే యుండిరి. సాయంత్రము మూడుగంటలవేళ, జానకమ్మతో కుమారునిపెండ్లివిషయము మాట్లాడుచుండెను. విజ్ఞానమునకు కర్నూలునుంచి మంచి సంబంధము వచ్చినదనియు, మూడువేలుకట్నమిచ్చెదరనియు, లాంఛనములన్నియు జరిపెదరనియు, పిల్లమాత్రము కొంచెము చిన్నదనియు నేవేవో చెప్పదొడంగెను.

జా.- పోనిండు, యీయేడు కాకపోయిన మరియొకయేడు కాపురమునకు వచ్చును. తొందరేమి కుఱ్ఱవాడింకను చదువుచున్నాడు. పెండ్లిమాత్రము తప్పక యీమాఘమాసమున జేసివేయవలయును. సంబంధము

లీలాగునవస్తునే వుంటాయి. ఏదోవొకటి స్థిర పరుచు కోవలయునుగాని యెంతకాలం యీవిధానడపేటు చేయడం." అన్నది.

దామో—అదే ఆలోచిస్తూవున్నాను. ఈవూర రామారావుగారిసంబంధ మొకటి యున్నది. ఈ రెంటిలో నేది నిశ్చయింపవలసి నదీ తెలియుటలేదు.

జాన:—కట్నాలా కానుకలా? ఎంత మందైనా వస్తారు. మనతో సరిగా తూగలేనిదే, ముద్దుముచ్చట లేలాతీరుతాయి? పిల్ల అందంగా వుంటే సరే! ఈపిల్లకున్న అందము దీనికుంది; వాళ్ల పిల్ల కున్నయందము దానికుంది. నాకేమీ ఈవూరిసంబంధము నచ్చుట లేదు. సాధ్య మయినంతవరకు తూరుపు సంబంధము స్థిరపరచండి.

దామో:—ఏమో! యింతకూ మనవానికేదియిష్టమో.

జాన:—ఇష్ట మేమిటి? మనంచెపితే ఒప్పుకుంటాడు, వాడి కేమి తెలుసును?" ఇంతలో విజ్ఞానుడు "మంచినీళ్లమ్మా" యని లోన ప్రవేశించెను.

జాన:—"నాయనా!కూర్చో"అని మంచి నీళ్లిచ్చెను.

దామో:—అబ్బాయీ! నీకు పెండ్లి చేయాలనీ మీ అమ్మ పట్టుపట్టుచున్నది. నీ యిష్టమేమిటి?

విజ్ఞా:—తొందరేమిటి? చేసుకోవచ్చును లెండు.

జాన:—ఈకబుర్లు కట్టిపెట్టు. మీ దటికి నీవెవరో, మే మెవరమో? ఎప్పటిముచ్చట అప్పటిది. పెండ్లి చేసికోనంటూ వేమిటి? నిశ్చేపములాగున యీరోజున మీనాన్నగారితో, నెవరో మంచిసంబంధము కుదురుస్తానన్నారట. మూడువేలుకట్నము. పెద్దలమాట తీసి వేయగూడదు.

విజ్ఞా:—"సరి! కట్నమేనా యింకా యేవయినా కనుక్కున్నారా? కట్నములుంటేనేకాని పెండ్లి దలపెట్టగూడదు కాబోలు" అని మొగము చిట్లించుచు మెల్లగా ననెను.

జాన:—నీకేమి తెలుసును? ఫలానావారి కుఱ్ఱవానికి కట్నం లేకుండా పెండ్లి యినదంటే నలుగురిలోను నాకు చిన్నతనం వేస్తుంది. కట్నం లేకుండా.........ఇది యెక్కడైనా వుంటుందా!

విజ్ఞా:—కట్న ముంటేనేకాని పెండ్లాడ గూడదా యేమి? ఎవరో పిల్లనిచ్చెదరని మోస పొమ్మనెదనా! చెప్పెడుమాటలను వినడమేనా! మనము వెళ్లి పిల్లను చూడలేదు. నాకేమియు నచ్చలేదు. ఈవూరి రామారావు గారి సంబంధ మెందుచేత చేసికొనగూడదు. అయినింటిపిల్ల; చదువుకొన్నది; దగ్గరనున్న సంబంధము యొక్కమంచిచెడ్డలు విచారించుకొనక, యెక్కడికో దూరముపోవుట యెందులకు దూరపుకొండలు నును పన్నట్లు"— అనుచు వెళ్లిపోయెను.

దా:—చూచితివా మనవానికబురులు. నీ కంతపంత మేమిటి? పోనీ వాడిఇష్టమువచ్చిన సంబంధమే స్థిరపరచుకొందాము. ఈకాలములో కుఱ్ఱవాండ్లయిష్టమువచ్చినట్లు నడవక పోతే మాట దక్కదు. వాడు చదువుకున్న వాడు. మంచిచెడ్డలు తెలుసును—

అని యీవిధి నచ్చజెప్ప బ్రయత్నించెనుగాని భార్య తనముద్దెందుచేత చెల్లింపగూడదని మౌర్ఖ్యపుపట్టు పట్టియుండుటచే దామోదరుడుగారి యుపన్యాసమేమియు నామెకు రుచింపలేదు. ఇంతలో సాయంత్ర మగుచుండుటచే దామోదరుడుగారు క్లబ్బునకు వెడలిపోయిరి.

౬

విజ్ఞానుడు సుగుణంబుల ప్రోవు. వివాహములయందలి దురాచారములు కిష్టసుఖములు చాలకాలము వితర్కించినవాడు. అనుకూలదాంపత్యసౌఖ్యముల కన్యోన్యప్రేమమే హేతువనియు, సద్దాని నీవరశుల్కము లక్ష్యము చున్నవనియు గ్రహియించినవాడు. తన యుద్దేశమును చివరకు తలిదండ్రులకు గూడ తెలియజేసెను. ఈతని వాక్యంబులు, వారలు సుంతయైన పాటింపక, కట్న మెక్కువయిచ్చు సంబంధ మేస్థిరపరచుకొని వివాహ ప్రయత్నములను చేయుచుండిరి. విజ్ఞానుడు తన తండ్రిగూడ తల్లితో నేకీభవించినందుల కెంతయు జింతించెను. తల్లి, యీతని రామారావునింటికి పోవలదని యాజ్ఞాపించెను. పాపము! విజ్ఞానుడెప్పుడు తల్లిమాట జవదాటి యెరుంగడు. మునుపటివలె నిప్పు డాతనికి తన ప్రేమకు నెలవగు సుగుణామణి సుందరముఖావలోకనము తరుచు లభించు భాగ్యముగూడ పోయెను. ఆతని కేమియు దోచుటలేదు. అట్టు సుగుణామణి ప్రేమానుబంధమును ద్రెంపివేయలేడు. ఇటు తల్లిమాటను జవదాటలేడు. ఎటుచేయుటకును దోపక నాతడు మతిపోయినట్లు గానవచ్చుచుండెను భోజనంబైనను సరిగ చేయకుండెను.

తల్లిదండ్రు లీతనిసంగతి కొంచమైనను గ్రహింపలేదు.

౭

రాత్రి యెనిమిదిగంట లాయెను. నాడు పూర్ణిమయగుటచే చంద్రుడు షోడశకళాపరిపూర్ణుడై ప్రకాశింపదొడగెను. అపుడు సుగుణ తనసోదరుని గదితెరచి యందలి దీపము నొకింత పెద్దదిగాజేసి కుర్చీ నలంకరించి మెల్ల రామాయణముం దెరచి తన మృదుమధురకంఠస్వరంబున నెత్తి చదువదొడంగెను.

సుగుణామణి యారవ తరగతివరకును జదివినది. తనకు ప్రాయము రాదొడంగినది మొదలు బడిలోనికి వెడలుట మానివైచినది. తెలుగుభాషయం దభిరుచిగల దగుటచే, పనులెన్నియున్నను దీక్ష నొదవ జేసికొని, సద్గ్రంథముల జదువునలవాటుగలది. ఆమె యెల్లవేళల చదువునందే కాలముపుచ్చక, తనతల్లికింటియందలి పనులయందుగూడ సహాయము జేయుచు తననామధేయమును సార్థకపరుచుకొనుచుండెను. తనకు ప్రాయమువచ్చినది మొదలు తనమనంబును విజ్ఞానరావునందే నిలిపి యాతనినే పెండ్లియాడ దలంచియుండెను. తనతల్లిదండ్రులుగూడ తనకోర్కె కనుగుణముగ జరియించుచున్నట్లు గ్రహించి ద్విగుణీకృతోత్సాహముతోనుండెను. విజ్ఞానుడు తన యింటికనేకమారులువచ్చుచుండినను, ఆపె కాతనితో మాట్లాడుటకైన వీలు చిక్కలేదు.

వీలుచిక్కినను లజ్జాభయరజ్జు వామెను వెను
కకు లాగివైచుచుండెను.

విజ్ఞానుడు భోజనముజేసి, యింటియొద్ద కాలేజీ హాస్టలులోని కనిచెప్పి రామారావు గృహంబునకై బయలుదేరెను. వీథితలుపులు తెరచియుండుటచే విజ్ఞానుడు లోన బ్రవేశించి, రామారావుగదియొద్దకు వచ్చి గుమ్మములో నిలుచుండి సుగుణచదువుటను వినుచుండెను. కొంతసేపటి కామె పైకిజూచి గుమ్మములో విజ్ఞానునిగాంచి త్రపావశయై గదిని వదలిపోవ యత్నించెను; గాని యాతడడ్డముగా నిలువబడుటచే వీలులేక అట్లే నిలువబడిపోయెను. ఆమెకు యెవ్విధమైన సిగ్గులేకయె నాతని బలుకరింపవలెనని కోరిక వొడమెను.

విజ్ఞానుడా వామెం గాంచుచు అట్లే నిలువబడిపోయెను కొంతతడవున కాతనిశరీరమంతయు చెమటచేదడిసిపోవుచుండెను. ఆతని విశాలనేత్రము లశ్రుపూరితము లగుచుండెను. ఆతనిపెదవులు వణక దొడంగెను. సుగుణ యిదంతయుగాంచుచు భీతచేతస్కయై తల్లడిల్లదొడంగెను విజ్ఞానుడు, పొంగిపొరలి వచ్చు తనదుఃఖము నెట్టకేల కాపికొని 'సుగుణ ముఖారవిందముం గాంచుభాగ్య మిదియే తనకు కడసారియేమో'అనియు, నింకనేవియో కొన్నివచనంబుల జెప్ప నాతనిమాటలు తడబడదొడంగెను. గద్గదికస్వరయై యాసుగుణాలలామ యెట్టకేలకు కారణంబడుగ నాతడు తనతల్లిదండ్రుల యుద్దేశముం జెప్ప నామె వాతాహతింబడిన వల్లికవలె పడిపోయెను.

* * * * సుగుణ కొంతసేపటికి తెలివి నొంది తనకు విజ్ఞాను డుపచారములు సేయుచున్నట్లు గ్రహించి, మెల్లనలేచి నిలువంబడియెను. అపుడు 'సుగుణా! దైవానుగ్రహ మున్నచో మనకనుకూలముగ జరుగకపోవునా? మనమంత దీనికై వెరవగూడదు. నేను మును పటివలె మీయింటికివచ్చిన నాతల్లిదండ్రులను మానపడియెదరు. వీలగునప్పుడెల్ల వచ్చుచు"ండని యను నంతలో 'సుగుణా! అన్నయ్య వచ్చినాడు. తలుపుతీయు" మని కేక లోనుంచి రా నామె వెడలలేక వెడలెను.

విజ్ఞానుడును రామారావుతో సుమారు ఆమూలుగా మాటలాడి తరువాత తనయింటికి వెడలిపోయెను.

౮

నాటినుండియు సుగుణగృహంబున విచారమానసయై మెలగదొడగెను. విజ్ఞానుడు మునుపటివలె తరుచుగా తన్ను జూచుటకు వచ్చుట మానుటచే, నామె 'విజ్ఞానుని జూచుభాగ్యమునకై నను నోచనైతి'నని, నెమ్మనమున దిగులుపడజొచ్చెను. ఆమె విజ్ఞాను నెంతయు ప్రేమించినది. ఇపుడామె యాతనిసందర్శనమే లభింపనందున, నికముం దాతనిం దాను వివాహమాడుట కల్లయని మిగుల వెంగగొనెను.

పెద్దదియై పుష్పించుట కుద్యమింపనున్న యాప్రేమలత విలయకృశంబున కెరయగుచున్నది. ఆహా! ఎవ్వరికైన నాపరమేశ్వరుని తలంపులు దెలియ శక్యముగాదుగదా!

చివర కామె మంచము బట్టెను. దిన దినమున కామె శరీరము కృశింపదొడంగెను. విజ్ఞానునకు సుగుణం జూచుకుతూహల మువెం

డగుచుండెను. ఆతడు సుగుణక్షేమమును ప్రతి దినంబును రామారావు నడిగి తెలుసుకొనుచు నేయుండెను. ఏదినంబున కాదినమే విరక్తిచే నామెను జూచుట కశ్రద్ధ చేయుచుండెను ఇటుల నెలదినములు గడచిపోయెను. ఒకనాడు రామారావును కళాశాలయందు గాంచ నందున సుగుణ కెటులున్నదో యని త్వరపడుచు సెలవుదీసికొని, విజ్ఞానుడు సుగుణయింటి కేగెను.

విజ్ఞానుడు సుగుణయున్నగదిం జొచ్చెను.



మెరుపుతీగవలె మెరయు నామెలావణ్యమంతయు వెలవెలబోవుచుండెను. ఆమెశరీరము పాండించిపోయెను. ఆమె విశాలనేత్రములుమాత్ర మామెవదనమున కింకను వన్నెపెట్టుచునే యుండినవి. ఆమె యప్పటికే మాట్లాడుటలేదు. విజ్ఞానుడామెం గాంచి నిర్ఘాంతపోయెను. అతడామెమంచముచెంత జేరి కన్నీరు కాల్వలుగార విచారించుచుండెను.

రామారావు కొంతసేపటికి "సుగుణా! విజ్ఞాను" డని గట్టిగా జెప్పెను. సుగుణ ప్రయత్నమున తనమనోనాయకుని జూచుటకై నయనంబుల పైకెత్తి తనకరంబు నప్రయత్నమున నాతనిహృదయమున వైచెను. ... ఇంతలో సుగుణ ప్రాణంబు లెగిరిపోవుట గ్రహియించి విజ్ఞానుడు గట్టిగా రోదనము జేయదొడంగెను.

అప్పటినుండియు విజ్ఞానుడు కళాశాలకుబోవుట మానివైచెను. ఒకనాడాతని సహాధ్యాయులు పత్రికలలో "విజ్ఞానుడు మతిభ్రమచే నెక్కడికో పోయెను. ఆతని పట్టి దెచ్చిన పుణ్యాత్ములకు 500 రు. బహుమాన మిచ్చెద" ననియు, పోలికలు మున్నగువానితో దామోదరుడుగారు ప్రచురించుట చదివిరి.——